సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



బై బై గణేశా !
మూడు రోజులుగా పూజలందుకున్న గణనాథులను ఆయా ప్రాంతాల్లోని కాల్వలు, నదుల్లో నిమజ్జనం చేశారు. బై బై గణేశా అంటూ వీడ్కోలు పలికారు. 8లో



వృద్ధులు, నిరక్షరాస్యులే టార్గెట్
ఏటీఎం కేంద్రాల వద్ద ఖాతాదారులు సొమ్ము కాజేస్తున్న మోసగాడిని కైకలూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వృద్ధులు, నిరక్షరాస్యులే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్నాడు. 8లో



హైవేపై కారు దగ్ధం
కొవ్వూరు-గుండుగొలను జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ఓ కారు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. కారులో ఉన్నవారు అప్రమత్తమై దిగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. 8లో

న్యూస్‌రీల్

తగ్గిన గోదావరి ఉధృతి



గోదావరిలో పంటు రాకపోకలు

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి నీటిమట్టం సాధారణ స్థితికి చేరుకుంటుంది. గోదావరి శాంతించడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. పట్టణ పరిధిలో గోదావరి తీరం వెంట ఉన్న పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ముంపు భయం పూర్తిగా తొలగింది. మాధవాయిపాలెంరేవులో పంటు రాకపోకలు సోమవారం నుంచి పునరుద్ధరించారు. వలంధర్ రేవు వద్ద భక్తులు స్నానాలు చేయడానికి అనుమతి ఇచ్చారు. అయితే మళ్లీ రెండు, మూడు రోజుల్లో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందంటున్నారు.

జిల్లాలో 18.4 మి.మీ. వర్షపాతం

భీమవరం: జిల్లాలో సోమవారం సరాసరి 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో 31.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా పెంటపాడులో 25.6, తణుకులో 23.4, అత్తిలిలో 23.6, గణపవరంలో 18.8, ఆకివీడులో 11.2, ఉండిలో 13.6, పాలకోడేరులో 15.6, పెనుమంట్రలో 15.8, ఇరగవరంలో 27.4, పెనుగొండలో 18.4, ఆచంటలో 25.4, పోడూరులో 17.6, వీరవాసరంలో 13.8, భీమవరంలో 14.8, కాళ్లలో 7.2, మొగల్తూరులో 8.8, నరసాపురంలో 12.2, పాలకొల్లులో 27.4, యలమంచిలిలో 14.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కేంద్రం దృష్టికి ఉప్పుటేరు సమస్య

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



ఉప్పుటేరును పరిశీలించిన కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ఆకివీడు: కొల్లేరు సరస్సుకు అవుట్‌లెట్‌గా ఉన్న ఉప్పుటేరు డ్రెయిన్ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. కొల్లేరు ముంపు బెడదను పరిశీలించేందుకు సోమవారం ఆకివీడు, మందపాడు, అయిభీమవరం గ్రామాల్లోని ఉప్పుటేరు ప్రవాహ వేగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన ఉప్పుటేరు డ్రెయిన్ ప్రస్తుతం 8 వేల క్యూసెక్కులతో ప్రవహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారన్నారు. ఉప్పుటేరులో పూడికలు పేరుకుపోవడంతో నీటి ప్రవాహ వేగం తగ్గిపోయిందని, దీనివల్ల కొల్లేరు సరస్సు తీరంలోని గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని మంత్రి చెప్పారు. ఆయన వెంటన బీజేపీ మండల కమిటీ అధ్యక్షులు కట్రెడ్డి ఏడుకొండలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యండగండి లాకుల పరిశీలన

ఉండి: భారీ వర్షాలకు కాలువలు, డ్రెయిన్‌లు ఉప్పొంగి వరదలు వచ్చే అవకాశాలు ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ రాహూల్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఉండి మండలం యండగండిలో ఉండి కాలువపై లాకులు, షట్టర్‌లు, గేట్లను పరిశీలించారు. ఉండి కాలువ, యనమదుర్రు డ్రెయిన్ గట్లను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ వుండాలని అన్నారు. ప్రస్తుతం యనమదుర్రు డ్రెయిన్ ప్రవాహం 29.2 అడుగులకు చేరిందని మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశామన్నారు. 31 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

- 30 గ్రామాల్లోకి వరద నీరు
- కొవ్వాడలంక రేవులో నీటిలో చిక్కుకుని వృద్ధురాలి మృతి
- కైకలూరును వదలని ముంపు నీరు

కొల్లేరు మహోగ్రరూపం



మండవల్లి మండలం కొవ్వాడలంకలో పూర్తిగా నీట మునిగిన దృశ్యం



కైకలూరు మండలం సర్కారు కాల్వ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

కొల్లేరు మహోగ్రరూపం దాల్చింది. బుడమేరు వరద నీటికి వర్షాలు తోడవడంతో కొల్లేరు గ్రామాలన్నీ ఐదు రోజులుగా ముంపు నీటిలో నానుతున్నాయి. ఇంతవరకు కొల్లేరు పరివాహక ప్రాంతాల్లోని 30 గ్రామాలు నీట మునిగాయి. విజయవాడ వరద బాధితుల మాదిరిగానే నిత్యావరన వస్తువులు సరఫరా చేయాలని కొల్లేరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండవల్లి మండలం కొవ్వాడలంకలో బట్టలు ఉతుకుతూ ఘంటసాల రుక్మిణి(58) నీటిలో మునిగి మృతి చెందింది. ఆటపాక పక్షుల కేంద్రం పూర్తిగా నీట మునిగింది.

సాక్షి ప్రతినిధి, ఏలూరు/కైకలూరు : బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా ఏలూరు జిల్లాలో మరో నాలుగు రోజులు పాటు వర్షాలు పడతాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెప్పడంతో కొల్లేరు గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. ఇప్పటికే మండవల్లి మండలం పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, కొవ్వాడలంక, పులపర్రు, నుచ్చుమల్లి, తక్కెళ్ళపాడు, ఆనందపురం, మూలపేట, సుబ్బారావుపేట, ఉనికిలితో పాటు కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, గుమ్మళ్ళపాడు, గోకర్ణపురం, పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప, కొట్టాడ వంటి గ్రామాల చుట్టూ నీరు వరద నీరు చేరింది. ఆలపాడు నుంచి కొల్లేటికోట వెళ్ళే రహదారిలో ఒక చోట, సర్కారు కాల్వ నుంచి అమ్మవారి దేవస్థానం చేరే రోడ్డులో మరో చోట రోడ్డుకు గండ్లు పడ్డాయి. శృంగవరప్పాడు నుంచి పైడిచింతపాడు మీదుగా ఏలూరు చేరే రహదారిలో అనేక చోట్ల గండ్లు పడటంతో నీరు రోడ్డుపై నుంచి పారుతోంది.

ఆక్వా విలవిల

వరదలకు ఆక్వా రంగం విలవిల్లాడుతోంది. ఇప్పటికి దాదాపు 600 ఎకరాల్లో చెరువుల గట్లుకు గండ్లు పడ్డాయి. లక్షలాది ఎకరాల్లో చేపల, రొయ్యల చెరువుల గట్లు ప్రశ్నార్థకంగా మారాయి. ఇప్పటికే కొల్లేరులంక గ్రామాల్లో చెరువులపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. రొయ్యల రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. గట్లు తెగి రొయ్యలు డ్రెయిన్లలోకి చేరుతున్నాయి. నానాటికి నీటి మట్టాలు పెరగడంతో రైతులు చేపలను కాపాడుకోడానికి వలలు కట్టుకుంటున్నారు. మరికొంత మంది ఇసుక బస్తాలు గట్లకు అడ్డుపెట్టుకుంటున్నారు.

పొంగి పొర్లుతున్న డ్రెయిన్లు

కైకలూరులోనూ పలు డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. వెలంపేట కాలనీలో వర్షపు నీరు పారక ఇళ్లను ముంచెత్తింది. పుల్లవ డ్రెయిన్ కారణంగా కైకలూరు - గోపవరం రహదారిలో నీరు చేరింది. రాకపోకలు స్తంభించాయి. తామరకొల్లు నుంచి వేమవరప్పాడు వెళ్ళే రహదారిలో పెద కొమ్ములేరు డ్రెయిన్ కారణంగా రోడ్డుపై మూడు అడుగుల నీరు ప్రవహిస్తోంది. డ్రెయిన్లలో పూడిక తీయకపోవడం, ఆక్రమణల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది.

గతంలోనూ వరద విలయం

2003లో కొల్లేరు వరదల కారణంగా సుమారు 1.20 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 2005లో 1.60 లక్షల ఎకరాలు పంట పొలాలు ముంపు బారిన పడగా, 2020 వరదల్లో లక్షలాది ఎకరాల్లో ఆక్వా చెరువులు నీట మునిగి రైతులు నష్టపోయారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, ఎర్రకాలువల నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో, కొల్లేరు పరిసరాల్లోని 20 వేల ఎకరాల చేపల చెరువులు నీట మునుగాయి. సుమారు 16 వేల ఎకరాల పంట చేలల్లో నీరు చేరింది.

భారీగా వరద

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కొల్లేరుకు 67 డ్రెయిన్లు, వాగుల ద్వారా 1.10 లక్షల క్యూసెక్కుల వరద నీరు కొల్లేరుకు చేరుతుంది. ఈ నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రానికి చేరాల్సి ఉండగా, ఎగపోటుతో మండవల్లి మండలంలో పలు గ్రామాలు ముంపు నీటిలో చిక్కుకున్నాయి. కైకలూరు మండలంలో పెంచుకలమర్రు, శృంగవరప్పాడు, కొట్టాడ, వడ్లకూటితిప్ప ముంపు బారిన పడ్డాయి. వరదకు సంబంధించి ఏలూరు డివిజన్ పరిధిలో ఏడు చోట్ల పునరావాస కాలనీలు ఏర్పాటుచేశారు. పెదపాడు మండలంలో 300 ఇళ్లలోకి వరదనీరు చేరింది. కొల్లేరు నుంచి సముద్రంలోకి నీటిని తీసుకుపోయే ఉప్పుటేరుకు డిశ్చార్జి కెపాసిటీ తక్కువగా ఉండటంతో గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. ప్రధానంగా బుడమేరు, తమ్మిలేరు. రామిలేరు, ఎర్రకాలువల నుంచి కొల్లేరుకు భారీగా వరదనీరు వస్తుంది. అయితే 1.10 లక్షల క్యూసెక్కుల నీటికి కేవలం 12 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి చేరుతుంది.

సుప్రీంకోర్టు ఆదేశాలతో..

2004లో వరద నష్టంపై స్పందించి సుప్రీంకోర్టు కొల్లేరు ప్రక్షాళనపై సాధికారిత కమిటీ వేసింది. ఈ కమిటీ అనేక సూచనలు చేసింది. ఫలితంగా దివంగత నేత వైఎస్సార్ హయాంలో కొల్లేరు ప్రక్షాళన చేపట్టారు. సుమారు 70 వేల ఎకరాల్లో చేపల చెరువు గట్లను కొట్టేశారు. అనంతరం కొల్లేరు సమస్యకు కొంత ఉపశమనం దొరికింది. మళ్లీ టీడీపీ హయాంలో కొల్లేరు ఆక్రమణల పర్వానికి గురైంది.



కొల్లేరుకు చేరే వరద నీటిని సముద్రానికి పంపే ఉప్పుటేరు వద్ద గుర్రపుడెక్క తొలగిస్తున్న దృశ్యం



మండవల్లి మండలం నుచ్చిమిల్లి వద్ద వరదనీటిలో మునిగిన చేపల చెరువు

ముంపు నివారణకు సూచనలు

- బుడమేరు నుంచి ఉప్పుటేరు ముఖద్వారం వరకు పైలెట్ చానల్స్‌కు అడ్డంగా ఉన్న అన్ని ఆక్రమ చెరువులను తొలగించాలి.
- అనుబంధ చానల్స్ చిన ఎడ్లగాడి, పోల్‌రాజ్, తమ్మిలేరు, గుండేరు, దోసపాడు, ఎస్కేప్‌ల ద్వారా వచ్చే నీటి ప్రవాహాలకు అడ్డంకులు తొలగించాలి.
- రెండవ పైలట్ చానల్‌గా పిలిచే మూర్తిరాజు కాల్వకు పందికోడు, తోకలపల్లి, రామన్న కాలవ, సిద్ధాపురం, బద్రికోడు డ్రెయిన్లను కలిపి, మూర్తిరాజు కాలువ ఆక్రమణలను తొలగించి, సరాసరి ఉప్పుటేరుకు చేరే మార్గాలను వెడల్పు చేయాలి.
- నక్కలనోడు, ఆగడాలంక, ఎస్కేప్ డ్రెయిన్, నల్లకోడును మూర్తిరాజు కాలవలోకి కలపడానికి అడ్డంకులు తొలగించాలి.
- కొక్కిరాయిలంకనోడును ప్రత్తికోడులంక దగ్గర పైలెట్ చానల్‌లో కలపాలి.
- పెదఎడ్లగాడి నుంచి పెనుమాకలంక చినఎడ్లగాడికి 20 వేల క్యూసెక్కుల నీరు పోవడానికి బ్రిడ్జి ఏర్పాటు చేయాలి.
- కొల్లేటికోట నుంచి గుండుగొలను, పైడిచింతపాడు మీదుగా ఏలూరు చేరే రోడ్లలో కొల్లేటికోట - పైడిచింతపాడు మధ్య వంతెన కట్టాలి.

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి స్వల్పంగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి వరద 29.60 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 30.570 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. 5.82 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతుంది.

ఎర్ర కాల్వకు మొదటి ప్రమాద హెచ్చరిక

తాడేపల్లిగూడెం రూరల్/జంగారెడ్డిగూడెం రూరల్: ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎర్ర కాలువకు వరద కొనసాగుతుంది. దీంతో తాడేపల్లిగూడెం మండలం నందమూరు అక్విడెక్ట్ వద్ద 29.7 అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ సోమవారం తెలిపారు. భారీ వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కెకెఎం ఎర్రకాలువ జలాశయంలోకి వరద చేరుతోంది. సోమవారం గంటకు 4,488 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, గేట్ల ద్వారా గంటకు 3,915 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నట్లు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 82.06 మీటర్లుగా ఉంది. జల్లేరు వాగు ఉధృతికి పట్టెన్నపాలెంలో జల్లేరు వాగుపై నిర్మించిన డైవర్షన్ రహదారి ధ్వంసమైంది.



తాడేపల్లిగూడెం మండలం నందమూరు అక్విడెక్ట్ వద్ద ఎర్ర కాల్వ వరద ప్రవాహం



పట్టెన్నపాలెంలో జల్లేరు వాగుపై ధ్వంసమైన డైవర్షన్ రహదారి

అలరించిన యోగా విన్యాసాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా యోగసన భారత్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సీతారామ్ భర్తియా కల్యాణ మండపంలోని నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో బాలలు ప్రదర్శించిన యోగా విన్యాసాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. జూనియర్స్, సబ్ జూనియర్స్ తదితర విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో అనన్య సామాన్యమైన ప్రతిభను చిన్నారులు తమ యోగా విన్యాసాలతో చాటుకున్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారిని త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో యోగాసన భారత్ సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆలపాటి నాగేశ్వర రావు, ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యక్షులు ఎంఎస్‌వీ మురళీకృష్ణ, కె.భాను, కోశాధికారి పి.సాంబశివరావు పాల్గొన్నారు.



యోగా విన్యాసాలు ప్రదర్శిస్తున్న బాలలు

విజేతల వివరాలు..

జూనియర్ బాలికల విభాగం : ఎం బృంద ప్రథమ, ఎం దివ్య ద్వితీయ, వి.వర్షిత తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ బాలుర విభాగం : జి.రోహిత్ ప్రథమ, బి.పవన్ మణికంఠ ద్వితీయ, పి.మోక్షజ్ఞ తృతీయ.

సబ్ జూనియర్ బాలికల విభాగం : జి.లాస్య, జి.శ్రావణి, కె.సిరి తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

సబ్ జూనియర్ బాలుర విభాగం : కె.వసంత్, ఎస్ వత్సిన్, సి.సురేంద్రబాబు తొలి మూడు స్థానాలు సాధించారు.

రవాణా చార్జీలు భారం కాకూడదు

కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ఉచిత ఇసుకను సరసమైన రవాణా చార్జీలతో అందించేందుకు టిప్పర్లు, లారీలు యజమానులు సహకరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో టిప్పర్లు, లారీ ఓనర్స్ అసోసియేషన్‌తో సమావేశమై ఉచిత ఇసుక రవాణా చార్జీలను సమీక్షించారు. ప్రభుత్వం ప్రజలందరికీ ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో నూతన ఇసుక పాలసీని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందన్నారు. జిల్లాలో ప్రస్తుతానికి ఇసుక అందుబాటులో లేదని, అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా నుంచి అందుబాటులో ఉన్న ఇసుకను పొందవచ్చన్నారు. టిప్పర్, లారీ ఓనర్స్ సమావేశంలో అంగీకరించిన చార్జీల వివరాలను ప్రభుత్వానికి ఆమోదం నిమిత్తం పంపామని, కలెక్టర్ తెలిపారు. 18 టన్నుల కెపాసిటీ కలిగిన 10 టైర్ల లారీకి 40 కిలోమీటర్ల వరకు రూ.10, 40 కిలోమీటర్లు పైబడి ప్రతి కిలోమీటర్‌కు రూ.8 చొప్పున, పది టన్నుల ఆరు టైర్ల లారీకి 40 కిలోమీటర్ల వరకు రూ.11, 40 కిలోమీటర్ల పైబడి కిలోమీటర్ ఒక్కొంటికి రూ.8, నాలుగున్నర టన్నుల కెపాసిటీ కలిగిన ట్రాక్టర్ ట్రాలీకి 40 కిలోమీటర్ల వరకు రూ.15, 40 కిలోమీటర్ల పైబడి ప్రతి కిలో మీటర్ ఒక్కొంటికి రూ.6 చొప్పున రవాణా చార్జీలను నిర్ణయించామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, రవాణా అధికారి పి.ఉమామహేశ్వర రావు, గనులు, భూగర్భ శాఖ అధికారి జి.జయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మళ్లీ ముంచిన వాన



ఆకివీడు మండలంలో భారీ వర్షాలకు నీట మునిగిన వరి పైరు

- గత వర్షాలకు 13 వేల ఎకరాల్లో నాట్లకు నష్టం
- తాజాగా 13,590 ఎకరాల్లో పైరు మునక

భీమవరం: భారీ వర్షాలకు పశ్చిమ గోదావరి జిల్లాలో పలు మండలాల్లో వరిపైరు నీట మునగడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. నాట్లువేసే సమయంలో భారీవర్షాలు, వరదలు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. తాజాగా వాయుగుండం కారణంగా కురిసిన భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి నాట్లు నీటమునిగాయి. జిల్లాలోని 20 మండలాల పరిధిలో ప్రస్తుత సార్వా సీజన్‌లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. జూలైలో కురిసిన వర్షాలకు వేలాది ఎకరాల్లోని నారుమళ్లు, నాట్లు నీటమునిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. అనేకమంది రైతులు తిరిగి నాట్లు వేసుకున్నారు. గతంలో కురిసిన వర్షాలు, వరదల కారణంగా సుమారు 13 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ గుర్తించి ఆ మేరకు రైతులకు సాయం అందించాలని ప్రతిపాదించింది. అయితే ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ మినహా ఇంతవరకూ ఇన్‌పుట్ సబ్సిడీ ఊసే ఎత్తలేదు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులతో తిరిగినాట్లు వేసుకోవాల్సి వచ్చింది.

వర్షాలకు 13,590 ఎకరాల్లో నీట మునక

ఇటీవల కురుస్తున్న వర్షాలకు డ్రెయిన్లు, కాలువలు పొంగి ప్రవహించడంతో జిల్లాలో దాదాపు 13,590 ఎకరాల్లో పైరు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. కొల్లేరు ప్రవాహం పెరుగుతున్నందున పైరు మునక మరింత పెరిగే అవకాశముంది. ప్రధానంగా కాళ్ల, ఆకివీడు, యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లో ఎక్కువగా నీట మునిగాయి. డ్రెయిన్లలో మురుగునీరు సక్రమంగా పారకపోవడంతో పైరు నీటలోనే మునిగివుంది. ఎక్కువ రోజులు పైరు నీటిలో మునిగివుంటే పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ. 20 వేలు వరకు పెట్టుబడి పెట్టామని మరొకసారి పైరు దెబ్బతింటే తిరిగి నాట్లు వేసుకునే అవకాశముండదని రైతులు చెబుతున్నారు.

బూస్టర్ డోస్‌గా ఎరువులు వాడాలి



నీటి మునిగిన వరిచేలలో నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. చేలలోని మురుగు నీరు బయటకు వెళ్లిన తరువాత బూస్టర్ డోస్‌గా ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ కలిపి చల్లుకోవాలి. తెగుళ్ల ఆశించకుండా సాఫ్ 400 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరం విస్తీర్ణంలో పిచికారి చేసుకోవాలి.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, భీమవరం

క్లుప్తంగా

వృద్ధురాలు మృతి

మండవల్లి: దుస్తులు ఉతకడానికి రేవుకు వెళ్లి కాలు జారిపడి ఒక వృద్ధురాలు మృతి చెందింది. కొవ్వాడలంక గ్రామానికి చెందిన ఘంటసాల రుక్మిణి (58) మనవరాలు ప్రసవ వేదనతో ఏలూరు ఆసుపత్రికి ఆమె బంధువులతో వెళ్లారు. ఇంటి వద్ద ఉన్న రుక్మిని ఎదురుగా ఉన్న రేవుకు దుస్తులు ఉతకడానికి వెళ్లింది. రేవులో కాలు జారడంతో ఆమె మృతి చెందింది. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యువతి బలవన్మరణం

కుక్కునూరు: కూలిపనుల కోసం చత్తీస్‌ఘడ్ నుంచి కుక్కునూరు మండలం గణపవరం జామాయిల్ నర్సరీలకు బంధువులతో కలిసి వచ్చిన యువతి అనుమానస్పద స్థితిలో జామాయిల్ చెట్టుకు ఉరివేసుకోని సోమవారం మృతి చెందింది. కొవ్వాసి పాయకి (18) తన సోదరుడు, మరికొందరు బంధువులతో కలిసి గణపవరం మకాం వచ్చింది. ఆమె తరుచూ రీల్స్ చూస్తూ పనులు చేయకుండా కాలక్షేపం చేస్తుండడంతో తన అన్నయ్య సెల్‌ఫోన్ తీసుకోని దాచిపెట్టాడు. దీంతో యువతి అలిగి ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానస్పదమృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

గాయపరచి డబ్బులు లాక్కున్న కేసులో ట్విస్ట్

నరసాపురం: నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు తనపై దౌర్జన్యం చేసి, గాయపరిచి జేబులో ఉన్న రూ.4 వేలు లాక్కున్నారని 22వ వార్డు కొత్తకాలనీకి చెందిన కారాడి చిన్ని ఆదివారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే చిన్ని సోమవారం చికిత్స పొందుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. చిన్ని అలా అబద్దాలు చెబుతూ ఉంటాడని, అతనిని ఎవరూ కొట్టి గాయపర్చలేదని చిన్ని భార్య సోమవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కొత్తకాలనీలోని స్నేహితుడి ఇంట్లో ఈనెల 7న బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడని పేర్కొంది. కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై జయలక్ష్మి వివరించారు.

కులగణన వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న గూడూరి వెంకటేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన వెంటనే చేపట్టాలని ఆల్ ఇండియా బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పాలకొల్లు రెయిన్ బో కిడ్స్ ప్లే జోన్ హాల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2011లో జనగణన జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కుక్కల సత్యనారాయణను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, మల్లుల వరలక్ష్మిని రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా, మహ్మద్ ముబీనా బేగంను మహిళా విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులుగా నియమించారు. జిల్లా అధ్యక్షుడుగా కండిబోయిన సుబ్రహ్మణ్యం, బెల్లపు భూలోకంను జిల్లా సంయుక్త కార్యదర్శిగా, నర్సింగ్ సింగ్‌ను జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. కడలి చంటేశ్వరరావును మొగల్తూరు మండల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గానుబోయిన దుర్గారావు, గుబ్బల నాగేశ్వరరావు, ఎం వెంకటేశ్వరరావు, పాల మహేంద్ర, డి.కిరణ్‌కుమార్, కె.సత్యనారాయణ, రాయుడు కృష్ణారావు, మోటుపల్లి ముత్యాలరావు, ధనకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.



మండవల్లి: పెరికెగూడెంలో వినాయకుని ఊరేగింపు



పెనుగొండ : సిద్ధాంతం వశిష్టా గోదావరిలో గణేష్ నిమజ్జనం



ఉండి : నిమజ్జనానికి వినాయకుడిని తరలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

బైబై గణేశా!

గణపతిబప్పా మోరియా.. జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై.. బైబై గణేశా.. అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలు మార్మోగాయి. డప్పు వాయిద్యాలు.. డీజే సౌండ్ల హోరు.. చిత్రవిచిత్ర వేషధారణలు.. యువకుల నృత్యాల నడుమ గణేష్ విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. మూడు రోజులుగా పూజలు అందుకున్న గణనాథులను ఆయా ప్రాంతాల్లోని కాల్వలు, నదుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



భీమడోలు : గణేష్ ఊరేగింపులో మేళతాళాల సందడి



పాలకోడేరు : పెన్నాడలో వినాయక ఊరేగింపులో యువత ఉత్సాహం



ఏలూరు : కొత్తపేటలో వినాయక విగ్రహం ఊరేగింపు



ద్వారకాతిరుమల : పంగిడిగూడెంలో ఊరేగుతున్న గణేషుడు



ద్వారకాతిరుమల : పంగిడిగూడెంలో గణేష్ ఊరేగింపులో శక్తి వేషాలు

ట్రిపుల్ ఐటీ హాస్టళ్లలో వాషింగ్ మెషీన్ల ఏర్పాటు

నూజివీడు: స్థానిక ట్రిపుల్‌ఐటీలోని ఐదు హాస్టళ్లకు హయ్యర్ కంపెనీ ట్రయల్ బేస్‌లో ఏర్పాటు చేసిన 15 వాషింగ్ మెషీన్లను డైరెక్టర్ ఆచార్య ఎం చంద్రశేఖర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం వాషింగ్ మెషీన్లు ఏర్పాటు చేశామన్నారు. వికలాంగులు ఈ మెషీన్లను ఉచితంగా ఉపయోగించుకోవచ్చని, మిగిలిన విద్యార్థులు మాత్రం నామమాత్రపు రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దాదాపు 6,600 మంది విద్యార్థులకు వారి దుస్తులు ఉతుక్కోవడానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. వాషింగ్ మెషీన్ల ఏర్పాటు ద్వారా నీటి వృథా కూడా తగ్గుతుందని తెలిపారు. వీటిని విద్యార్థులు జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని కోరారు. హయ్యర్ స్మార్ట్ సొల్యూషన్స్ దక్షిణ భారతదేశ మేనేజర్ ఎస్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఇప్పటి వరకు దాదాపు 3 వేల వాషింగ్ మెషీన్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఓ బి.లక్ష్మణరావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ అధికారులు బ్రహ్మస్వాములు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



వాషింగ్ మెషీన్లను ప్రారంభిస్తున్న డైరెక్టర్ ఆచార్య ఎం చంద్రశేఖర్

పసికందు మృతిపై ఆందోళన

టి.నరసాపురం: వైద్యుల నిర్లక్ష్యంతోనే తన బిడ్డ చనిపోయిందని బాలింత, ఆమె కుటుంబ సభ్యులు మండలంలోని బొర్రంపాలెం పీహెచ్‌సీ వద్ద సోమవారం ఆందోళన చేశారు. బాలింత వడ్లాని రేఖ, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేఖకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి బొర్రంపాలెం పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. సోమవారం సాయంత్రం రేఖ ప్రసవించింది. వెంటనే పసికందును జంగారెడ్డిగూడెం పిల్లల ఆసుపత్రికి రిఫర్ చేశారు. అయితే జంగారెడ్డిగూడెంలోని పిల్లల ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. తెలుసుకున్న రేఖ బంధువులు పీహెచ్‌సీ వద్దకు వచ్చి ఆందోళన చేశారు. సమయానికి రేఖను ఆసుపత్రికి తీసుకువచ్చినా, వైద్యులు ప్రసవానికి చర్యలు తీసుకోకుండా జాప్యం చేశారని ఆరోపించారు. వారి నిర్లక్ష్యం వల్లే పసికందు మృతిచెందినట్టు తెలిపారు. ఏఎస్సై జయకుమార్ పీహెచ్‌సీకి చేరుకుని బాలింత బంధువులతో చర్చించగా వారు ఆందోళన విరమించారు. కాగా ఘటనపై పీహెచ్‌సీ వైద్యురాలు ఇమామ్‌బీని వివరణ కోరగా, బిడ్డకు తల్లి కడుపులోనే పేగు వరుసలుగా చుట్టుకుని మృతిచెందినట్టు చెప్పారు.

మామిడి తర్వాత ప్రాధాన్యత పంట అరటి

తాడేపల్లిగూడెం : మామిడి తర్వాత అత్యంత ప్రాధాన్యత గల పంట అరటి అని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ అన్నారు. ఉద్యానవర్సిటీ, కేవీకే సంయుక్తంగా కేవీకేలో అరటితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. అరటి పంటగా, కూరఅరటిగా ప్రాచుర్యం పొందడంతో పాటు సంస్కృతి, సామాజిక వేడుకల్లో ప్రాముఖ్యత పొందిన పండ్లరాజం అరటి అన్నారు. ఏడాది పొడవునా లభించే అరటి విస్తీర్ణంలో, దిగుబడిలో ప్రపంచంలో మొదటి స్థానం ఆక్రమించిందని తెలిపారు. మన రాష్ట్రంలో 99,372 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. 5.8 మిలియన్ టన్నుల ఉత్పత్తితో ఈ పంట అగ్రగామిగా ఉందని తెలిపారు. ఉమ్మడి పశ్చిమలోని కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు, చాగల్లు మండలంతో పాటు తాడేపల్లిగూడెం, నల్లజర్ల మండలాలు, గిరిజన గ్రామాలైన జీలుగుమిల్లి మండలాల్లో సుమారు 2,500 ఎకరాల్లో ఈ పంటను సాగుచేస్తున్నారన్నారు. తెల్లచక్కెరకేళీ, కర్పూర, పచ్చ అరటి,కూర అరటి రకాలు ముఖ్యమైనవన్నారు. అరటి కోత అనంతరం అరటిచెట్టు, ఆకులు, డొప్పలు వృథా అవుతాయని, వీటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా తయారు చేయడానికి ఐదురోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్టు కేవీకే సమన్వయకర్త ఇ.కరుణశ్రీ చెప్పారు. నాబార్డు ద్వారా అరటి రైతులకు లభించే పథకాలను డీడీఎం, అనిల్‌కాంత్ వివరించారు. పరిశోధన సంచాలకులు ఎం మాధవి, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసు, జి.రామానందం, మాస్టర్ ట్రైనర్ ఎస్ ప్రతాప్, కార్తికేయన్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో శిక్షకులతో ఉద్యానవర్సిటీ వీసీ గోపాల్

రోడ్డు ప్రమాదంలో వెల్డర్ దుర్మరణం



పిల్లా విష్ణు(ఫైల్)

భీమడోలు: జాతీయ రహదారి కురెళ్లగూడెం పెట్రోలు బంకు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెల్డర్ దుర్మరణం చెందాడు. బత్తాయి లోడ్ వ్యాన్ అతివేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న మోటార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉంగుటూరుకు చెందిన పిల్లా విష్ణు (35) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే.. విష్ణు కురెళ్లగూడెంలోని ఓ మహిళను పెళ్లి చేసుకుని ఆమెతో ఆదే ఊరిలో ఉంటున్నాడు. పూళ్ల సమీపంలోని పి.కన్నాపురం వద్ద గల వెల్డింగ్ షాపు నడుపుతున్నాడు. వారాల పండుగ నేపథ్యంలో రాత్రి వెల్డింగ్ పనులు ముగించుకుని కురెళ్లగూడెంకు తన బైక్‌పై వర్షంలో వస్తుండగా పెట్రోలు బంకు సమీపంలోకి వచ్చే సరికి విజయవాడ నుంచి తాడేపల్లిగూడెం వైపుగా అతివేగంగా వెళ్తున్న బత్తాయి లోడ్‌వ్యాన్ హైవే గోతులను తప్పించబోయి బైక్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న విష్ణు తలకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాను బోల్తా పడి బత్తాయిలు రోడ్డుపై పడ్డాయి. ట్రాఫిక్ స్తంభించింది. సీఐ బీబీ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. భీమడోలు పోలీసులు విష్ణు మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి పోస్ట్‌మార్టమ్ నిమిత్తం తరలించారు. ఎస్సై సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డుపై బత్తాయి లోడు బోల్తా చెల్లాచెదురుగా పడిన పండ్లు

తండ్రిపై కుమారుడు కత్తితో దాడి



చికిత్స పొందుతున్న బాధితుడు సత్యనారాయణ

ఏలూరు టౌన్: భర్త దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతూ ఉంటే బాగోగులు చూసుకోవాల్సిన భార్య తన కొడుకును రెచ్చగొట్టి తండ్రిపై దాడి చేయించింది. బాధితుడు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఏలూరు తంగెళ్లమూడి రోడ్డులోని ఎంఆర్‌సీ కాలనీకి చెందిన బూరి సత్యనారాయణకు భార్య రామలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉపేంద్ర, ఫణీంద్ర ఉన్నారు. ముఠాకూలీగా పనిచేస్తున్న సత్యనారాయణకు తొమ్మిదేళ్ల క్రితం దీర్ఘకాలిక వ్యాధి ఉన్నట్టు తెలియటంతో చికిత్స పొందుతున్నాడు. నాలుగేళ్లగా ఆరోగ్యం మరింత క్షీణించటం, తీవ్రమైన కడుపునొప్పితో రెండుసార్లు ఆపరేషన్ చేయించుకున్నాడు. సొంత కుమారులనే రెచ్చగొట్టి తనను లేకుండా చేయాలని తన భార్య చూస్తోందని ఆరోపించాడు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటివద్ద ఉండగా తన చిన్న కుమారుడు ఉపేంద్రకు తన భార్య కత్తి ఇచ్చి తనను చంపాలని చెప్పటంతో చేతిపై కత్తితో దాడి చేశాడని వివరించాడు. చేతిపై తీవ్రగాయం కావటంతో బంధువుల సాయంతో ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. తాను అనారోగ్యంతో ఉంటే ఇంట్లోని బీరువా తాళాలు పగులగొట్టి ఇంటి పత్రాలు, బంగారు ఆభరణాలు, సుమారు రూ.3 లక్షల నగదును కాజేశారని వాపోతున్నాడు. ఆస్తి కోసమే తనను చంపాలని చూస్తున్నారని తెలిపాడు. ఏలూరు జీజీహెచ్ వైద్యులు మెడికో లీగల్ కేసుగా గుర్తించి హాస్పిటల్ అవుట్‌పోస్టు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భీమవరం: ఇంటి తాళాలు బద్దలుకొట్టి దుండగులు బంగారం, వెండి నగదు చోరీ చేశారు. భీమవరం టూటౌన్‌లోని ఆదర్శ్ నగర్‌కు చెందిన దండు రంగరాజు ఈనెల 4వ తేదీన తన కుమార్తె వద్ద కుటుంబంతో సహా బెంగళూరుకు వెళ్లారు. అయితే ఈ నెల 8న తన పక్క నివాసంలో ఉండే వ్యక్తి ఫోన్ చేసి ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయని చెప్పడంతో వచ్చి చూసుకునేసరికి 20 గ్రాములు బంగారం, 500 గ్రాములు వెండి, 50 వేల నగదు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదులో కేసు దర్యాప్తు చేపట్టామని టూ టౌన్ ఎస్సై రెహమాన్ తెలిపారు.

హైవేపై కారు దగ్ధం



పోలసానిపల్లిపై దగ్ధమవుతున్న కారు

భీమడోలు: కొవ్వూరు–గుండుగొలను జాతీయ రహదారి పోలసానిపల్లి సమీపంలో సోమవారం రాత్రి ఓ కారు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రాజమండ్రి నుంచి విజయవాడకు జడిగం వీరభద్ర స్వామి తన కారులో మరో ముగ్గురు కలిసి వెళ్తున్నారు. కారును వీరభద్రస్వామి నడుపుతుండగా పోలసానిపల్లి సమీపం వద్దకు వచ్చేసరికి కారులోని ఏసీ నుంచి పొగ వచ్చి మంటలు చెలరేగాయి. కారులో ఉన్నవారు వెంటనే అప్రమత్తమై దిగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కారు మంటల్లో కాలిపోయింది. విషయం తెలుసుకున్న భీమడోలు ఎస్సై వై.సుధాకర్ ఏలూరు ఫైర్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. ఏలూరు అగ్నిమాపక కేంద్రం ఎల్ఎఫ్ గరికిపాటి నాగేంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఫైర్ సిబ్బంది తెలిపారు.

స్వదేశానికి తీసుకెళ్లాలని మహిళ అభ్యర్థన



వాడ జ్యోతి

జంగారెడ్డిగూడెం రూరల్: మలేషియాలో చిక్కుకుపోయిన తనను స్వదేశానికి తీసుకెళ్లాలంటూ జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంకు చెందిన వాడ జ్యోతి వేడుకుంటోంది. మలేషియా నుంచి సెల్ఫీ వీడియో ద్వారా తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ కన్నీటి పర్యంతమైంది. నెలకు రూ.50 వేలు ఇచ్చే మంచి ఉద్యోగాన్ని ఇప్పిస్తానని జంగారెడ్డిగూడెంకు చెందిన విజయ అనే మహిళ తనను నమ్మించి మలేషియాలో ఉన్న లలిత అనే ఏజెంట్‌కి తనకు అప్పగించిందని పేర్కొంది. మలేషియాలోని ఒక ఇంటిలో తనతో వెట్టి చాకిరి చేయిస్తుండంతో బయటకు వచ్చేశానని, తనను ఇంటికి పంపాలంటే రూ.లక్షా 20 వేలు ఇవ్వాలని లలిత అడగడంతో తమ కుటుంబ సభ్యులు ఆ నగదు ఇచ్చారని వివరించింది. గురవాయిగూడెంలో ఉన్న జ్యోతి కుమార్తె మైత్రి మాట్లాడుతూ గత నెల ఆగస్టు 4న తన తల్లి జ్యోతి మలేషియా వెళ్లిందన్నారు. అక్కడ ఆమె అనుభవిస్తోన్న నరకాన్ని గత 10 రోజుల క్రితం లక్కవరం పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని చెప్పింది. అధికారులు స్పందించి తన తల్లిని ఇంటికి తీసుకొచ్చేలా ప్రయత్నాలు చేయాలని వేడుకుంది.

వృద్ధులు, చదువురాని వారే టార్గెట్

ఏటీఎంల వద్ద ఖాతాదారుల సొమ్ము కాజేసిన దొంగ అరెస్టు



డీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఏటీఎం కేంద్రాల వద్ద ఖాతాదారులు సొమ్ము కాజేస్తున్న మోసగాన్ని కైకలూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను సోమవారం ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ వెల్లడించారు. కైకలూరు మండలం సింగాపురం గ్రామానికి చెందిన బొల్లా వెంకటేశ్వరరావు ఆగస్టు 5న ఉదయం ఏటీఎం కేంద్రంలో నగదును డ్రా చేయడానికి వెళ్లి ఇబ్బంది పడుతుండగా, అక్కడ ఒక యువకుడు గమనించాడు. ఏటీఎం మెషీన్ నుంచి డబ్బులు తీసి ఇవ్వడంతో వెంకటేశ్వరరావు ఇంటికెళ్లాడు. అయితే ఏటీఎం కార్డును నిందితుడు మార్చివేయటంతోపాటు కొంత సేపటి అనంతరం దఫదఫాలుగా రూ.46 వేలు కాజేశాడు. దీనిపై వెంకటేశ్వరరావు కైకలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్సై, సిబ్బంది సోమవారం ఉదయం కైకలూరు గాంధీబొమ్మ సెంటర్‌లో నిందితుడు మోటారు సైకిల్‌పై వస్తుండగా పట్టుకున్నారు.

విలాసాలు, జూదం కోసమే

కోనసీమ జిల్లా ఐ పోలవరం ప్రాంతానికి చెందిన పల్లా సురేంద్రకుమార్ (32) అలియాస్ సురేంద్ర జల్సాలకు, క్రికెట్ బెట్టింగ్, పేకాటకు బానిసగా మారాడు. ఏటీఎం కేంద్రాల వద్దకు వచ్చే వృద్ధులు, చదువురాని వ్యక్తులను టార్గెట్ చేసి, వారిని నమ్మించి, డబ్బులు తీసి ఇస్తాడు. కానీ ఏటీఎం పిన్ నెంబర్ గుర్తు పెట్టుకుని, అతని వద్ద పనిచేయని ఏటీఎం కార్డును వారి చేతిలో పెడతాడు. అనంతరం ఏటీఎంలోని వారి బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును కాజేస్తూ జల్సాలు చేస్తాడు. ఇలా నిందితుడు సురేంద్రపై సుమారు 60కి పైగా కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. సురేంద్ర నుంచి కైకలూరు పోలీసులు పలు కేసుల్లో రూ.46 వేలు, రూ.25,400, రూ.15 వేలు రికవరీ చేశారు. ఈ కేసుల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. మోసగాళ్లు, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

క్లుప్తంగా

ఆక్రమణలు తొలగించాలని వినతి



గ్రామంలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని కార్యదర్శి తెలియజేస్తున్న గ్రామ పెద్దలు

కాళ్ల: కోమటిగుంట గ్రామంలో మురుగు కాలువనువ ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించాలని స్థానిక పెద్దలు పంచాయతీ అధికారులను కోరినట్లు సోమవారం తెలిపారు. ప్రభుత్వం కాలనీలో స్థలాలు ఇచ్చినప్పటికీ వెళ్లడం లేదని తెలిపారు. దీనివల్ల గ్రామంలో చిన్నపాటి వర్షం వస్తే మురుగనీరు వెళ్లక రహదారులు ముంపునకు గురవుతున్నాయని స్పష్టం చేశారు. తుఫాన్ కారణంగా వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నందున గ్రామంలో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ బోనం భాగ్యశ్రీ శివకుమార్, ఎరుబండి రామాంజనేయులు వార్డు మెంబర్ యలమంచిలి శ్రీనివాస్, నక్కన శ్రీను, సచివాలయ సెక్రెటరీ వెంకటరమణ వాసు కలిసి సమస్యను తెలియజేసి, పరిష్కరించాలని కోరారు.

గర్భస్రావాలను తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): గర్భస్రావాలను తగ్గించడానికి వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు అన్నారు. ఆయన అధ్యక్షతన జిల్లా ఎంటీపీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లల లింగ నిష్పత్తి పెంచాలని సూచించారు. తల్లీ, బిడ్డకు ఏమైనా ప్రమాదం ఉందని తెలిసిన సందర్భాల్లో మాత్రమే నిబంధనలకు లోబడి గర్భస్రావాలను చేయాలన్నారు. రికార్డులు, మందుల వినియోగం, పరికరాల నిర్వహణ సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో జిల్లా కమిటీ మెంబర్లు డాక్టర్ ఐ.లక్ష్మి, డాక్టర్ చింతి ఆనంద్, ఆర్.విక్టర్, డాక్టర్ డి.సుధాలక్ష్మి, పి.అనంతలక్ష్మి, ఆర్.కె కుమారి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



భీమవరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేస్తున్నదృశ్యం

భీమవరం: భీమవరం మెంటవారితోటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాలకొల్లు లయన్స్ ఆసుపత్రి సహకారంతో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యుడు కోయ కిషోర్ ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో 342 మంది రోగులను పరీక్షించగా 75 మందికి కళ్లజోళ్లు, 80 మందికి ఆపరేషన్ అవసరమవుతాయని గుర్తించారు. 10 రోజుల్లో కంటి శస్త్ర చికిత్సలు చేస్తామని లయన్స్ హాస్పిటల్ మేనేజర్ లక్ష్మీపతి రాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ గ్లోబల్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణంరాజు, రీజనల్ చైర్ పర్సన్ జి కృష్ణమూర్తి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పేరిచర్ల మూర్తిరాజు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షిత నీటిని సరఫరా చేయాలి

భీమవరం అర్బన్: ఫిల్టర్ బెడ్లు ద్వారా తాగునీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని తోకతిప్పలో సోమవారం సీపీఎం మండల నాయకులు ఓహెచ్ఆర్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ ద్వారా సరఫరా చేసే నీరు మురుగుగా రావడంతో తాగటానికి పనికిరావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నీరు కలుషితమవడంతో స్నానాలు చేస్తే దురదలు వస్తున్నాయన్నారు. గ్రామంలో కచ్చా డ్రైనేజీలు లేకపోవడంతో ఎక్కడబడితే అక్కడ మురుగునీరు నిలిచిపోతుందన్నారు. అధికారులు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసి కచ్చా డ్రెయినేజీలు నిర్మించాలని లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

హామ్ రేడియో మోర్స్ కోడ్‌పై వర్క్‌షాప్

భీమవరం: ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో సాధారణ కమ్యూనికేషన్ వ్యవస్థలకు అంతరాయం ఏర్పడినప్పుడు అమెచ్యూర్ రేడియో టెక్నాలజీ (హామ్) ఎంతో ఉపయోగపడుతుందని అకాడమీ అఫ్ హామ్ రేడియో డైరెక్టర్ ఎ.రమేష్ బాబు తెలిపారు. విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో హామ్ రేడియో మోర్స్ కోడ్‌పై వారం రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు హామ్ రేడియో సర్టిఫికేషన్ పొంది అంతరిక్ష సాంకేతిక విద్యపై మొగ్గు చూపాలని ఆయన కోరారు.

ప్రజలను ఆదుకోవడంలో చంద్రబాబు విఫలం

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్: భారీ వర్షాలతో వరద ముంపు ప్రమాదం ఉందని ముందుగా హెచ్చరించినా పటిష్టమైన చర్యలు చేపట్టి ప్రజలను ఆదుకోవడంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విఫలమైందని మాజీ ఉప ముఖ్యమంత్రి, కొట్టు సత్యనారాయణ అగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన తాడేపల్లిగూడెంలో మాట్లాడుతూ.. బుడమేరు ప్రాంతం ముంపునకు గురవుతుందని తెలిసినా.. కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని ఆరోపించారు. వరద ప్రమాదాన్ని ముందుగా ప్రజలకు తెలియచేయకుండా, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా నిర్లక్ష్యం వహించారని దుయ్యబట్టారు. వెలగపల్లి రెగ్యులేటర్ నుంచి నీరు కృష్ణా నదికి వదలారని.. దీంతో విజయవాడ, కృష్ణలంక, వైఎస్సార్ నగర్, ఎన్టీఆర్ నగర్, వాంబే గృహాలు, రామవరం నుంచి వెనువైపు ఉన్న తదితర ప్రాంతాలు ముంపు బారిన పడటంతో సుమారు 2.50 లక్షల మంది ప్రజలు వరదల్లో చిక్కుకుని గత 9 రోజులుగా అల్లాడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద సమయంలో అన్ని చోట్ల ఇన్‌చార్జిలను నియమించి ప్రతి కుటుంబానికి నిత్యావసరాలు, నీరు, పాలు, ఆహారం అందజేయడంలో చంద్రబాబు విఫలమయ్యాడని ఆరోపించారు. వరద బాధితులకు ఇతర ప్రాంతాల నుంచి అందచేసిన ఆహార పదార్థాలను వారికి అందించడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల అవి పాడై నిరుపయోగమయ్యాయన్నారు. వరద బాధితుల వద్దకు వస్తే అధికారుల పనులకు ఆటంకం ఏర్పడుతుందని అందుకే తాను దూరంగా ఉంటున్నానని పవన్ కల్యాణ్ చెప్పడం ప్రజలకు అర్థం కావడంలేదన్నారు. జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి అవగాహన లేమి కారణంగా ప్రజలు అష్ట కష్టాలు పాలయ్యారని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వరద బాధితులను అడ్డంపెట్టుకొని లక్షల రూపాయలు డొనేషన్లు సేకరించడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఈ పరిణామాలకు కారణమైన చంద్రబాబు నాయుడు ఈ పరిస్థితికి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



అత్తిలి మండలం కంచుమర్రులో పంటచేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

అత్తిలి: పంటచేలు ముంపు నుంచి బయటపడిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అత్తిలి మండలం కంచుమర్రు, తిరుపతిపురం గ్రామాలలో ముంపుబారిన పడిన పంటచేలను సోమవారం మార్టేరు వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. నీటి ముంపు నుంచి కోలుకున్న వరిపంటకు ఎకరాకు 15 కిలోల యూరియా, 20 కిలోల ఎంటీపీ వేసుకోవాలని వారు రైతులకు సూచించారు. మొక్క నిలదొక్కుకున్న తర్వాత 2 గ్రాముల కార్బెండిజమ్, మాంకోజెట్ మిశ్రమాన్ని పై పాటుగా పిచికారి చేయడం ద్వారా తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు. పాముపొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున్న హెక్సాకోనజోల్ 2శాతం ఈసీ 2 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్ మల్లిఖార్జునరావు, మార్టేరు ఎంటమోలజిస్ట్ ఎ ఆనందకుమార్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ జె దయాల్ ప్రసాద్, మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్, వీఏఏ కృష్ణ, వీఆర్వో ఉషాదేవి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పరిశీలన

భీమవరం: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు బాగా నష్టపోయారని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని కోడవల్లి రోడ్డులో పడ్డ గుంతలను కేంద్ర మంత్రి స్వయంగా పరిశీలించారు. కేంద్ర మంత్రి రాష్ట్రంలో రైతులను ఆదుకోవడానికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాష్ట్రంలో పర్యటించి తాత్కాలిక సాయాన్ని ప్రకటించారని అన్నారు.

ఊరూవాడా ఘనంగా చవితి వేడుకలు



తణుకు అర్బన్: సజ్జాపురంలో భారీ గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు, కమిటీ సభ్యులు



తాడేపల్లిగూడెం (టీఓసీ): సాలిపేటలోని పాలబుచ్చెయ్య వీధిలో గణనాథునిని ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా తణుకు సజ్జాపురం రామాలయ ప్రాంతంలోని లక్ష్మి గణపతి యూత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినాయకస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ నుంచి తీసుకువచ్చిన భారీ గణనాథుడి విగ్రహాన్ని ఉంచేందుకు మండపాన్ని ప్రత్యేకంగా ముస్తాబుచేశారు. గణనాథుడిని చూసేందుకు సజ్జాపురవాసులతో పాటు పట్టణం నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. అర్చకుల ప్రత్యేక పూజాధికాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదములు పంపిణీ చేశారు.

బాలగణపతికి ప్రత్యేక పూజలు

అత్తిలి: గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బల్లిపాడు గ్రామంలో శ్రీమదనగోపాలస్వామివారి ఆలయ సన్నిధిలో నెలకొల్పిన శ్రీబాల గణపతికి సోమవారం విశేష పూజలు జరిపారు. గ్రామానికి చెందిన లింగం నాగేశ్వరరావు దంపతులచే లక్ష్మిగణపతి హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై హోమ పూజలలో పాల్గొన్నారు. బాల గణేష్ కమిటీ ఆధ్వర్యంలో నవ రాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు.



అత్తిలి: బల్లిపాడులో బాల గణపతి ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గణనాథుడికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వినాయక చవితి మహోత్సవాలు సందర్భంగా మూడో రోజు సోమవారం పట్టణంలోని గణనాథుని ఉత్సవ పందిరలు వద్ద స్వామి వార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవ కమిటీలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, మహిళలు స్వామి వారిని దర్శించి విశేష పూజలు చేశారు. 3వ రోజు కావడంతో పలు ఉత్సవ కమిటీలు ఆధ్వర్యంలో గణనాథులను పట్టణంలో ఘనంగా ఊరేగించి పెద్ద శివాలయం వద్ద ఉత్సవ మూర్తులను నిమజ్జనం చేశారు. తీన్‌మార్ డప్పులతో, బాణా సంచా కాల్పులతో ఉత్సవ మూర్తులు ఊరేగింపు జరిగింది.



తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరు 11వ వార్డులో గణనాథుడుకి ప్రత్యేక పూజలు చేస్తున్న పిల్లలు

రైతులంతా ఈకేవైసీ చేసుకోవాలి

తణుకు టౌన్: రైతులు తమ పంటలను త్వరితగతిన ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కే కుసుమ రైతులను కోరా రు. సోమవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో జరుగుతున్న ఈకేవైసీ పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో కుసుమ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన ఈకేవైసీకి రైతులంతా సహకరించాలని కోరారు. ఇప్పటి వరకూ 54 శాతం ఈకేవైసీ జరిగినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సిబ్బంది మల్లికార్జునరావు, పుష్ప, అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద జరిగిన సమావేశంలో సోమవారం తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లుర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2004లో ఇదే ధర్మాసనం ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించడం రాజ్యాంగ విరుద్ధమని తీర్పునిచ్చిందన్నారు. నేడు రాష్ట్ర పరిధిలో వర్గీకరణ చేసుకోవచ్చునని చెప్పడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆర్టికల్ 341 సవరించకుండా వర్గీకరణ చేయరాదని, అసాధ్యమన్నారు. అంబేద్కర్‌ను ఏకవచనంతో మహార్ కులస్తుడని మందకృష్ణ మాట్లాడాన్ని మంగరాజు తీవ్రంగా ఖండించారు. రిజర్వేషన్లు వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం వెనక్కి తీసుకునే వరకూ పోరాటం చేస్తామని చెప్పారు. జైపాల్, సబ్బిత రావు, చంటి, ప్రేమ్‌కుమార్, అచ్చిబాబు, అబ్రహం, సన్నీ, మురళీ పాల్గొన్నారు.

ఉధృతంగా వయ్యేరు



దువ్వ వయ్యేరు అక్విడెక్ట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వయ్యేరు వరద

తణుకు టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గత మూడు రోజులుగా ఎగువ ప్రాంతాలల్లోని మురుగునీరు ఎర్ర కాలువ ద్వారా దువ్వ వయ్యేరులో ప్రవహించడంతో వయ్యేరుకు వరద ఉధృతి పెరిగింది. సోమవారం సాయంత్రానికి దువ్వ వయ్యేరు అక్విడెక్ట్ వద్ద 9 అడుగులకు నీటి మట్టం చేరుకోవడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వరద పరిస్థితిని పరిశీలించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తణుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని వీధులు జలమయమయ్యాయి. తణుకు పట్టణంలోని ఒకటో వార్డులోని న్యూ బ్యాంక్ కాలనీలో వీధులు వర్షపు నీటిలో మునిగిపోయాయి. దీనితో మున్సిపల్ సిబ్బంది జేసీబీల సహాయంతో మురుగునీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేపట్టారు. వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లోని మురుగునీటి డ్రెయిన్‌లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మురుగునీరు పంట పొలాలకు ఇబ్బంది లేని విధంగా చర్యలు చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తణుకు: సైకిలిస్టును స్కూటీతో మరో వ్యక్తి ఢీకొట్టిన ఘటనలో తణుకు పట్టణానికి చెందిన వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన ఈ ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనానికి ఫోన్ చేసినప్పటికీ సకాలంలో రాకపోవడంతో స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో క్షతగాత్రుణ్ని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విష జ్వరాలు.. వణుకుతున్న జనం

పట్టణాలు, పల్లెలు మంచం పట్టాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో సీజనల్ రోగాలు ప్రబలుతున్నాయి. విష జ్వరాల బారినపడి ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. ఆగిఆగి కురుస్తున్న వర్షాలకు వాతావరణంలో నెలకొన్న మార్పులే ఇందుకు కారణమని వైద్యులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు కోరుతున్నారు.

- వర్షాలతో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ఆస్పత్రులకు క్యూకడుతున్న వైరల్ ఫీవర్ బాధితులు
- అధ్వాన్నంగా పారిశుద్ధ్యం..



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఓపీ రాయించుకునేందుకు వేచిఉన్న రోగులు.

తణుకు అర్బన్: వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రజల్ని పట్టిపీడిస్తున్నాయి. ఒళ్లు పులపరంగా ఉందంటే చాలు జ్వరం వచ్చేస్తుందేమోనని ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. జ్వరం అంటే రెండు రోజులు మందులు వాడితే పరిపోతాది, కానీ నేటి విష జ్వరాలు ఒకటి రెండు రోజుల్లో జ్వరం తగ్గిపోయినా ఆ తరువాత మొదలయ్యే సమస్యలను తలచుకుంటుంటే జ్వరం అనే మాటే భయపెడుతుందని బాధితులు చెబుతున్నారు. ఒంటి నొప్పులు, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులే కాకుండా మోకాలు నుంచి కాలి పాదాల వరకు వాపులతో అడుగు తీసి అడుగు వేయాలంటేనే భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా కొంతమందిలో కాళ్లు పట్టు వదిలేయడంతో కాళ్లపై నిలబడలేని వింత పరిస్థితి తలెత్తుతోందని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కొందరిలో ఈ సమస్యలు రెండు వారాలు ఉంటుండగా మరి కొందరిలో నాలుగు నెలలపాటు ఉంటాయని వైద్యులు చెబుతున్నారంటూ భయపడుతున్నారు. టైఫాయిడ్, వైరల్ జ్వరాల కంటే కూడా విష జ్వరాలంటే ప్రజానీకం భయపడిపోతున్నారు. ముఖ్యంగా ఈ జ్వరాల్లో కూడా ప్లేట్‌లెట్స్ పడిపోవడం, చిన్నపిల్లల్లో రక్తంలో ఇన్‌ఫెక్షన్ శాతం అధికంగా ఉండడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలో నిత్యం వందల సంఖ్యలో జ్వరపీడితులు

తణుకు నియోజకవర్గంలో తణుకు పట్టణంతో పాటు తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో నిత్యం వందల సంఖ్యలో జ్వరపీడితులు ఆయా ఆస్పత్రులకు వస్తున్నారు. ముఖ్యంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిత్య పిల్లలు, పెద్దలు కలిపి 50కిపైగా ఓపీకి జ్వరంతో వస్తుండగా, నిత్యం పిల్లల వార్డు, పురుషులు, స్త్రీల వార్డుల్లో జ్వరంతో బాధపడుతూ 30 మందికిపైగా వైద్యసేవలు పొందుతున్నారు. అంతేకాకుండా తణుకు పట్టణంలోని 3 అర్బన్ హెల్త్ సెంటర్లుతోపాటు నియోజకవర్గంలోని 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నియోజకవర్గంలోని 40కిపైగా ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపీ వైద్యుల వద్ద నిత్యం వందల సంఖ్యలో జ్వరపీడితులు చికిత్స పొందుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు గ్రహణం..

జ్వరాలతో జనం అతలాకుతలమవుతున్నా తణుకు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై ఇటు పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు అధికమయ్యాయి. గతంలో బాగున్న పారిశుద్ధ్య నిర్వహణ నేడు గాడి తప్పిందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఏ రహదారిలో చూసినా చెత్తకుప్పలు, మురుగుపారని డ్రెయినేజీలు, దోమలకు ఆవాసాలుగా పెరిగిన పిచ్చిమొక్కలతో పట్టణమంతా మురికికూపంగా మారిపోయాయని ప్రజలు వాపోతున్నారు. గతంలోలేని సమస్య ఇప్పుడు ఎందుకు తలెత్తిందంటూ ప్రజానీకం ముక్కున వేలేసుకుంటున్నారు. వైద్యశాఖ అధికారయంత్రాంగం ప్రతిఇంటికి వెళ్లి వ్యాధులపైనా, పరిసరాల పరిశుభ్రతపైనా అవగాహన కల్పిస్తున్నప్పటికీ అధ్వాన్నంగాఉన్న పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు పాలకుల్లోను, మునిసిపల్ అధికారుల్లోను ఎటువంటి చలనం లేకపోవడంతో జనం జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగు రోజులుగా ఆస్పత్రిలో ఉన్నాం



మా అమ్మాయి కల్యాణికి జ్వరం వచ్చి కాళ్లపై నిలబడలేని పరిస్థితి తలెత్తింది. వెంటనే తణుకు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు ఆస్పత్రిలో ఉంచాలని సూచించారు. గతంలో ఎప్పుడూ చూడని వింత జ్వరాలు నేడు వస్తున్నాయి. నాలుగురోజులుగా ఆస్పత్రిలో ఉండగా ఆస్పత్రి వైద్యులు మంచి వైద్యం అందిస్తున్నారు. మొదట్లో భయపడ్డాను కానీ రోజురోజుకీ మా అమ్మాయి కోలుకుంటోంది.

– కుంపట్ల అనంతలక్ష్మి, అత్తిలి



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో జ్వరంతో బాధపడుతున్న చిన్నారులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పురుషుల వార్డులో జ్వరపీడితులు

రైతన్నపై ప్రకృతి కన్నెర్ర

- ఈదురు గాలులకు నేల వారుతున్న వరి చేలు
- పంట చేతికొచ్చే దశలో వర్షాలు
- కంట తడి పెడుతున్న రైతన్న



తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు గ్రామంలో ఈదురు గాలులకు నేలకొరిగిన వరి చేలు

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటపై ప్రకృతి కన్నెర్ర చేయడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ పంట చేతికొస్తున్న తరుణంలో కురుస్తున్న వర్షాలకు రైతన్న కంటిపై కునుకు లేకుండాపోతుంది. దీంతో తాడేపల్లిగూడెం మండలంలోని రైతాంగం కంట తడి పెడుతున్నారు. మండలంలో దాదాపు 11వేలు హెక్టార్లు పైబడి వరి పంట సాగు చేపట్టారు. ఖరీఫ్ సీజన్ కావడం, వర్షాలు పడే అవకాశం ఉండటంతో అధికారుల సూచన మేరకు ముందస్తుగానే వరి సాగును రైతాంగం చేపట్టింది. ముందుగా సాగు చేపట్టినా ప్రకృతి ముందు రైతన్న తల వంచక తప్పడం లేదు. ప్రస్తుతం వరి గింజ గట్టి పడటంతో పాటు మరో 15 నుంచి 20 రోజుల్లో పంట చేతికొచ్చే అవకాశం ఉంది. ఈ తరుణంలో వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు మండలంలోని కొండ్రుప్రోలు, ఎల్.అగ్రహారం, చినతాడేపల్లి, గొల్లగూడెం, పుల్లాయగూడెం, అప్పారావుపేట తదితర గ్రామాల్లో చేతికొచ్చి పంట నేలకొరిగింది. ఇలానే ఒకట్రెండు రోజులు వర్షాలు కురిస్తే కంకులపైనే మొక్క వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరానికి రూ.20వేలు పెట్టుబడి



ఖరీఫ్ సీజన్‌లో ఎకరానికి రూ.20వేలు పెట్టుబడి పెట్టాం. ఇప్పుడిప్పుడే పంట చేతికొస్తుంది. మరో 10 నుంచి 15 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఈ తరుణంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేలు పచ్చ రంగు వచ్చింది. దీని వల్ల పంట మరింత ఆలస్యం కానున్నది. ప్రకృతి అనుకూలిస్తే బాగుంటుంది.

– కోరశిఖ సత్యనారాయణ, కౌలు రైతు, గొల్లగూడెం, తాడేపల్లిగూడెం మండలం